సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



**ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి**
యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి మంచి భవిష్యత్తు ఏర్పరచుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. 8లో



**నాణ్యత లేకుంటే చర్యలు** 8లో
సంతల్లో నాణ్యతలేని వస్తువులు విక్రయించే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ హెచ్చరించారు.



**గంజాయి స్వాధీనం**
ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా తెలిపారు. 8లో

### నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?



ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నేతలు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి అమలుకు సాకులు వెతుకుతున్నారు. సూపర్ సిక్స్‌హామీల్లో ఒకటైన నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా పట్టించుకోవడంలేదు. ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి. అంతేకాకుండా 20 లక్షల ఉద్యోగాలు రిక్రూట్ చేయాలి.

– **బంగురు విజయ్‌కుమార్**, బీఎస్సీ బీఈడీ, బెద్దగుడ, పద్మాపురం

### అందరికీ తల్లికి వందనం ఇవ్వాలి



సూపర్ సిక్స్ హామీల్లో తల్లికి వందనం ఒకటి. ఎంత మంది పిల్లలుంటే అందరికి తల్లుల ఖాతాలో ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని చంద్రబాబు మాటిచ్చారు. ఇప్పటికి అతీగతి లేదు. దానిపై ప్రస్తావనే లేదు. ముగ్గురు పిల్లలుంటే రూ.45 వేలు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేస్తారని అనుకోలేదు. తినుబండారాల దుకాణం పెట్టుకుని వచ్చిన డబ్బులతో ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు పిల్లలను చదివిస్తున్నాం. ఇచ్చిన మాటకు కట్టుబడి తల్లికి వందనం చెల్లించాలి.

– **కొర్రా పార్వతి**, సంతవలస, డుంబ్రిగుడ మండలం

### మహిళకు రూ.1500 ఏమైంది?



18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు 1500 చొప్పున ఇస్తామని కూటమి నేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. మా ఇంట్లో ఇద్దరు ఉన్నందున నెలకు రూ.1500 వస్తుందని ఆశపడ్డాం. ఇస్తారన్న ఆశతో బ్యాంకు ఖాతాలు తెరుచుకుని ఎదురు చూస్తున్నాం.. కాని డబ్బులు పడలేదు. అధికారం చేపట్టిన తరువాత ఈ హామీ అమలు గురించి చంద్రబాబు మాట్లాడటం లేదు. నమ్మి ఓటేసినందుకు తగిన గుణపాఠం చెప్పారు. ఇప్పటికైనా అమలుచేయకుంటే మహిళల ఆగ్రహా నికి గురికాక తప్పదు.

– **దడియా విజయ**, పెదబయలు

### అన్నదాతను ఆదుకోవాలి



ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభమయ్యింది. పంటలు సాగు చేసుకోవాలి. వర్షాలు పడుతున్నాయి. గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు ఈపాటికే మాకు రైతు భరోసా సాయం ఖాతాల్లో జమ అయ్యింది. ఏటా చెప్పిన సమయానికే ఇచ్చి ఆయన రైతులను ఆదుకున్నారు.టీడీపీ నేతలు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా అతీగతీ లేదు. నమ్మిన రైతులందరినీ మోసం చేస్తున్నారు. ఇది సరికాదు.

– **వి రమణబాబు**, రైతు, ఎర్రగొప్పు, జి.మాడుగుల మండలం

# సూపర్ సిక్స్..
# వంచన ఫిక్స్




**అనుకున్నంతా అయ్యింది.. భయపడినట్టే జరిగింది.. జీవిత కాలంలో ఎన్నడూ మాట మీద నిలబడిన చరిత్ర లేని చంద్రబాబును నమ్మి జనం మరోసారి మోసపోయారు. సంపదను సృష్టిస్తా.. సంక్షేమాన్ని అందిస్తా అని ఎన్నికల ముందు చెప్పిన మనిషి.. నిండు శాసనసభలో సూపర్ సిక్స్ అమలును తలచుకుంటే భయమేస్తోందని చెప్పారు. తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు. విశ్వసనీయత అనేది వాతలు పెట్టుకుంటే రాదు. ప్రజలంటే ప్రేమ ఉండాలి.. వారికి మంచి చేయాలన్న తపన ఉండాలి.. చెప్పిన మాట మీద నిలబడాలి.. మనసా వాచా చిత్తశుద్ధితో వాగ్దానాలను అమలు చేయాలి.. మాట ఇచ్చే ముందే ఆలోచించుకోవాలి. అదీ నిజమైన ప్రజా నాయకుడి లక్షణం. అది ఏ కోశానా లేని వ్యక్తిని ఎందుకు అందలం ఎక్కించామా అని జనం అనుకునే పరిస్థితి వచ్చిందంటే ఆ ప్రజా ప్రతినిధి సిగ్గుతో తల దించుకోవలసిందే.**

## బంపర్ హిట్



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం ఇంటింటికీ అందింది. ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ సంక్షేమ క్యాలెండర్ ఏర్పాటు చేసి మరీ హామీలు అమలు చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన.. ఇలా ఒకటా రెండా ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయడంతో ఇంటింటా సంక్షేమం వెల్లివిరిసింది.

### జగన్ పాలనలో రైతులకు అందిన సాయం

రైతు భరోసా పథకం ద్వారా లబ్ధిదారులకు రూ. కోట్లలో



| | |
|---|---|
| అరకులోయ | 79.45 |
| పాడేరు | 80.83 |
| రంపచోడవరం | 75.95 |

### జగన్ పాలనలో తల్లులకు అందిన సాయం

అమ్మ ఒడి ద్వారా లబ్ధిదారులకు రూ. కోట్లలో




| | |
|---|---|
| అరకులోయ | 54.62 |
| పాడేరు | 44.63 |
| రంపచోడవరం | 52.50 |
| మొత్తం | 151.75 |

### ప్రతి మహిళకు నెలకు రూ.1500

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు



| | |
|---|---|
| అరకులోయ | 1,24,834 |
| పాడేరు | 1,27,633 |
| రంపచోడవరం | 1,44,502 |
| మొత్తం | 3,96,969 |

రూ.59 కోట్ల 54 లక్షల 53వేల 500

### ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు



| | |
|---|---|
| అరకులోయ | 90,144 |
| పాడేరు | 78,836 |
| రంపచోడవరం | 1,29,112 |
| మొత్తం | 2,98,092 |

రూ.73 కోట్ల 33 లక్షల 6వేల 20

### మహిళల ఉచిత బస్సు ప్రయాణం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు



| | |
|---|---|
| అరకులోయ | 1,83,704 |
| పాడేరు | 1,78,498 |
| రంపచోడవరం | 1,93,301 |
| మొత్తం | 5,55,503 |

## బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ
## వంద రోజులైనా సూపర్ సిక్స్‌లో అమలుకు నోచుకోని పథకాలు
## ఆరు నూరైనా పూర్తిస్థాయిలో అమలు చేయాలంటున్న జనం

సాక్షి,పాడేరు: ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టి వంద రోజులు కావస్తున్నా సూపర్ సిక్స్ హామీల ఊసెత్తకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్‌లోని పథకాలకు గిరిజన ప్రాంతాల్లో అర్హులు వేల సంఖ్యలో ఉన్నారు. 2014లోను అమలుకాని అనేక హామీలు ఇచ్చి చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమిలేకపోవడంతో చంద్రబాబును 2019లో ప్రజలు ఓడించారు. మళ్లీ ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం,18ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం పంపిణీ వంటి హామీలతో చంద్రబాబు 2024 ఎన్నికల ప్రచారం చేశారు. కూటమి నేతలు కూడా సూపర్ సిక్స్‌పై విస్తృత ప్రచారం చేశారు. టీవీలు, సోషల్ మీడియాలోను వీటిని హోరెత్తించారు. అయితే సీఎంగా బాధ్యతలు స్వీకరించి 50 రోజులు అవుతున్నా సూపర్ సిక్స్‌లోని ఏఒక్క పథకాన్ని కూడా ప్రారంభించకపోవడంతో అర్హులైన లబ్ధిదారులంతా కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

**అన్నదాత సుఖీభవ అందక మండిపాటు..**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి ఏడాది రైతు భరోసా కింద జిల్లాలోని 1,69,264మంది గిరిజన రైతులు రూ.13,500 చొప్పున ఆర్థిక సాయం పొందేవారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు రైతులకు పంపిణీ చేస్తానని చెప్పినప్పటికీ ఈ ఖరీఫ్ సీజన్‌లోను ఊసెత్తకపోవడంతో అన్నదాతలంతా ఆయనపై మండిపడుతున్నారు. వారంతా అప్పులు చేసుకుని వ్యవసాయం చేసుకోవాల్సిన పరిస్థితితో ఉసూరుమంటున్నారు.

**1,73,887 మంది ఎదురుచూపు**

ఎంతమంది పిల్లలు ఉన్నా బడికి వెళ్లే వారిలో ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున తల్లికి వందనం కింద ఆర్థిక సాయమన్న చంద్రబాబు, ఇటీవల మంత్రి లోకేష్‌తో ఈఏడాది అమ్మకు వందనం సాయం చేయలేమంటూ ప్రకటించడం దారుణమని తల్లులంతా ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. జిల్లాలో 1,01,170మంది తల్లులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా రూ.15వేల చొప్పున ఆర్థికసాయం పంపిణీ చేసేది. ఇప్పుడు ఈ సాయం కోసం 1,73,887 మంది ఎదురు చూస్తున్నారు.

**నిరుద్యోగ భృతి కోసం 2,98,092 మంది**

2014లోను నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని మోసం చేసినప్పటికీ ఈఎన్నికలలోను అదే హామీని ప్రధానంగా తీసుకొచ్చారు.ఈ పథకం పొందేందుకు జిల్లాలోని 2,98,092 బీపీఎల్ కుటుంబాల్లో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

**అమలుకు వేలాది మంది మహిళల ఎదురుచూపు**

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం 2,98,092 మంది, నెలకు రూ.1500 ఆర్థిక సాయం కోసం 3,96,969 మంది, ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని 5,55,503 మంది మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

### టీడీపీ పాలనలో అమ్మకు వందనం అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు



| | |
|---|---|
| అరకులోయ | 61.035 |
| పాడేరు | 57.082 |
| రంపచోడవరం | 55.770 |

మొత్తం రూ.260 కోట్ల 84 లక్షల 55 వేలు

### యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు




| | |
|---|---|
| అరకులోయ | 78,836 |
| పాడేరు | 90,144 |
| రంపచోడవరం | 1,29,112 |

నెలకు ఇవ్వాల్సిన సాయం
రూ.89 కోట్ల 42 లక్షల 76 వేలు

### టీడీపీ పాలనలో రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు



| | |
|---|---|
| అరకులోయ | 61.120 |
| పాడేరు | 59.880 |
| రంపచోడవరం | 56.264 |

మొత్తం రూ.338 కోట్ల 52 లక్షల 80 వేలు

### అమ్మ ఒడి ఆదుకునేది



మాకు నలుగురు సంతానం. అందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో అమ్మఒడి పథకం ద్వారా మాకు మేలు జరిగింది. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ద్వారా నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం ద్వారా మేలు జరుగుతుందని ఎంతో ఆశపడి ఓటువేశాం. ఇప్పుడు మోసపోయాం.

– **కిముడు ఈశ్వరమ్మ**, గరుడాపల్లి, హుకుంపేట మండలం

### ఉచిత ప్రయాణమెప్పుడు?



మహిళల కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకం తీసుకువచ్చింది. కానీ నేటికి అమలు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మహిళలను ఆకర్షించేలా పథకం పెట్టారు. గెలిచి అందలం ఎక్కిన తర్వాత దానిని మరిచిపోయారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పని సరిగా అందుబాటులోకి తేవాలి.

– **గొల్లోరి తులమ్మ**, పెద్దపేట,దారెల పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

### రైతు భరోసాతో ధీమా



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పొలం పనుల సీజన్‌లో ఏటా పెట్టుబడి సహాయం కింద రైతుభరోసా నగదు ఖాతాలో జమ అయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే ఏటా రైతులకు రూ.20వేలు ఇస్తామన్నారు. ఈ రోజు రైతులను మర్చిపోయారు. కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసింది.

– **పాంగి వెంకటరావు**, రాతులపుట్టు, హుకుంపేట మండలం

### ఎంతో మందికి ఉద్యోగాలు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంతోమంది ఉద్యోగాలు పొందారు. ఇప్పుడు అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అంతకు మించి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చి 50 రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదంటే నిరుద్యోగ యువత తిరగబడతారు.

– **కోరాబు వేణుగోపాల్**, బీఏ, నిరుద్యోగి, బొండపల్లి, జి.మాడుగుల మండలం

### చదువుకు ఉపయోగపడింది



మాకు ముగ్గురు పిల్లలు. వారిలో ఒకరు ప్రైవేట్, ఇద్దరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి నగదు బ్యాంకులో జమ చేయడంతో ఎంతో ఉపయోగపడేది. కూటమి నేతల హామీ మేరకు ముగ్గురు పిల్లలకు రూ.45 వేలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని ఆశపడ్డాం. 50 రోజులు గడుస్తున్నా జమ చేయకపోవడంతో మోసపోయాం.

– **వంతల సార**, బిగంగగుడ్డి, మాడగడ పంచాయతీ, అరకులోయ మండలం

### వాగ్దానం నిలబెట్టుకోవాలి



నా పేరు గొల్లోరి మణి. మాది పాడేరు మండలం గురుపల్లి గ్రామం. మాకు ముగ్గురు పిల్లలున్నారు. మాది వ్యవసాయ కుటుంబం. మా పిల్లల్ని బాగా చదివించుకుని ప్రయోజకులను చేయాలన్నది మా కోరిక. మా పెద్ద కుమార్తె తేజస్వినిని పాడేరులోని ఓ ప్రయివేటు పాఠశాలలో 4వ తరగతి చదివిస్తున్నాం. మా రెండో కుమార్తె మమతశ్రీ పాడేరు పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చేర్చాం. ఆమె ప్రస్తుతం రెండో తరగతి తరగతి చదువుతోంది. గత ప్రభుత్వ హయాంలో మా పెద్ద పాప తేజస్వినికి రెండేళ్ల పాటు అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15వేలు అందేది. దీంతో ప్రయివేటు పాఠశాల ఫీజును సులభంగా చెల్లించగలిగాం. ఈ ఏడాది ఇప్పటికి స్కూల్‌లో ఫీజు చెల్లించలేదు. ఎన్నికలకు ముందు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే వారిని బడికి పంపిస్తే ఒకొక్కరికి రూ.15వేలు తల్లికి వందనం పథకం ద్వారా చెల్లిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. పాఠశాలలు పునఃప్రారంభమై మూడు నెలలు అవుతున్నా నేటికీ సొమ్ము అందలేదు. పాఠశాల యాజమన్యం ఫీజుల కోసం ఒత్తిడి తెస్తోంది. టీడీపీ అధికారంలోకి వచ్చాక పాఠశాలలకు వెళ్తున్న ఇద్దరి పిల్లలకు కూడా తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.30 వేలు అందుతుందని ఆశగా ఎదురు చూస్తున్నాం. కానీ ఈ ఏడాది ఇవ్వమని మంత్రి లోకేష్ ప్రకటించడం మమ్మల్ని మోసం చేయడమే.

## ఇచ్చిన హామీలు.. ఇవిగో సాక్ష్యాలు



## క్లుప్తంగా

### ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్
- నిర్మల్ విజ్ఞాన యాత్ర ప్రారంభం

**పాడేరు:** యువత ఉన్నత లక్ష్యంతో మంచి భవిష్యత్తు ఏర్పరచుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు. గిరిజన విద్యార్థులకు ఏర్పాటుచేసిన నిర్మల్ విజ్ఞాన యాత్రను బుధవారం ఎస్పీ అమిత్‌బర్దర్‌తో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనతరం మాట్లాడుతూ విద్యావంతులైన గిరిజన యువతీ యువకులకు పారిశ్రామిక వాతావరణంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. బిటెక్, ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన 104 మందిని ఏపీ మెడిటెక్ జోన్ సందర్శనకు పంపిస్తున్నామని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ గిరిజన యువత మావోయిస్టులకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి రవాణా, సాగుకు స్వస్తి పలికి ఉజ్వల భవిష్యత్తుతో ముందుకు సాగాలని సూచించారు. పాడేరు ఏఎస్పీ ధీరజ్, సీఐ దీనబంధు, ఎస్ఐలు పాల్గొన్నారు.

### పెరుగుతున్న జ్వర పీడితులు



రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న జ్వరపీడితులు

**కొయ్యూరు:** వాతావరణంలో మార్పుల నేపథ్యంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి బుధవారం ఎక్కువ సంఖ్యలో వచ్చారు. వారికి వైద్యసేవలు అందించేందుకు పడకలు సరిపోలేదు.

### వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు



భవాని(ఫైల్)

**అరకులోయ టౌన్:** మండలంలోని బలుగుడా గ్రామానికి చెందిన పూజారి భవాని(23) కనబడడం లేదని భర్త రామచందర్ అరకులోయ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ సంతోష్ తెలిపారు. ఇద్దరు పిల్లలతో గత నాలుగు రోజుల నుంచి కనబడడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 630276909 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

### 'కొత్తపల్లి' కమిటీ కార్యవర్గం ఏర్పాటు



అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి చంటిబాబు

**జి.మాడుగుల:** మండలంలో కొత్తపల్లి జలపాతం కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా చంటిబాబు, కోశాధికారిగా వి.వెంకటరావు ఎన్నికయ్యారు.ఐటీడీఏ అనుబంధంగా టూరిజం కార్మికుల సంఘ ఎన్నికలు జరిగాయి. దీని పరిధిలో. 23మంది పనిచేస్తుండగా 10 మందితో కమిటీ ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షుడిగా వంతాల రాజు నియమితులయ్యారు. ఈ ఎన్నికకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ ఆధ్వర్యం వహించారు.

# పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

**కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం**

**సాక్షి,పాడేరు:** జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్మన్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పర్యాటక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర వివరాలతో చిన్న, పెద్ద తరహా పర్యాటక ప్రాజెక్ట్‌లకు డీపీఆర్ తయారుచేయాలని సూచించారు. వాటిలో వచ్చే ఆదాయం, ఖర్చులు, రవాణా, ఆతిథ్యం, వసతి తదితర వివరాలను పొందుపరచాలన్నారు. ఈ ప్రాజెక్ట్‌ల్లో గిరిజన సామాజిక వర్గాన్ని భాగస్వామ్యం చేయాలని సూచించారు. పర్యావరణానికి ముప్పు లేకుండా పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని సూచించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో టూరిజం కమిటీలు ఏర్పాటు చేయాలని, పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా గిరిజనులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. స్వదేశ్ దర్శన్‌లో భాగంగా అరకులోయ నుంచి పాడేరు మీదుగా లంబసింగి ప్రాంతాలను టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే బొర్రాగుహలకు కేంద్ర ప్రభుత్వం రూ.30 కోట్లతో అభివృద్ధికి అనుమతి ఇచ్చిందన్నారు. జిల్లాలో కారవాన్ టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డుంబ్రిగుడ అంజోడ వద్ద 4.50 ఎకరాలలో కారవాన్ పార్కింగ్, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసి పర్యాటక రంగంపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం ఐటీడీఏ నుంచి పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాస ఫణి, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, జిల్లా టూరిజం అధికారి జి.దాసు, డీపీవో కొండలరావు,స్కిల్ డవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్, గిరిజన సంక్షేమశాఖ, పంచాయతీరాజ్ ఈఈలు డీవీఆర్ఎం.రాజు,వేణుగోపాల్,కొండయ్యపడాల్,గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

## గిరిజన ఆశ్రమాలకు పర్యవేక్షణ లోపం

- మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- గంగవరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల సందర్శన
- ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులపై విద్యార్థినుల నుంచి ఆరా

**గంగవరం :** రంపచోడవరం నియోజకవర్గంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ లోపిస్తుందని, ఇందుకు ఉదాహరణగా జరుగుతున్న ఘటనలు నిలుస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. జూనియర్ కళాశాల విద్యార్థినులపై స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడటంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులు గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలపై దృష్టి సారించాలన్నారు. ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో పరిస్థితులను ఆమె విద్యార్థులు, సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. అన్నివిధాలుగా అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు.

**లైంగిక వేధింపులపై విచారణ**

ప్రధానోపాధ్యాయుడు లైంగిక వేధింపుల ఘటనపై విచారణాధికారిగా నియమితులైన రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. రంపచోడవరం డివిజన్‌లో ఆశ్రమ పాఠశాలల దుస్థితిని, వివిధ అంశాలను మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులనే నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పలరాజు, జిల్లా కార్యదర్శి దిండి బాబి, మర్రిపాలెం సర్పంచ్ మడకం వెంకటేశ్వర్లుదొర, పాల్గొన్నారు.



రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**చింతపల్లి:** గిరిజన సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులపై ఉపాధ్యాయులు, సంక్షేమాధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను ఆమె బుధవారం ఆకస్మికరంగా సందర్శించారు. కొద్ది రోజుల కిందట పాఠశాల నుంచి అదృశ్యమైన విద్యార్థి ఘటనపై విచారణ జరిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయుల అనుమతి లేకుండా విద్యార్థులెవరూ బయట వెళ్లేందుకు వీల్లేదని హెచ్చరించారు. విద్యార్థులెవరైనా అనారోగ్యానికి గురైతే వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడానికి ముందే విద్యార్థులను ఆస్పత్రుల్లో చేర్పించాలన్నారు. హెచ్ఎం పండన్న వార్డెన్ గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

## కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

**తాటిచెట్లపాలెం(విశాఖ):** కిరండూల్, బచేలి ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు దంతేవాడ వరకు మాత్రమే నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు, విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కిరండూల్-దంతేవాడ మధ్య రాకపోకలు సాగించవని పేర్కొన్నారు.

## గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

**చింతూరు:** ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న వంద కిలోల గంజాయిని బుధవారం చింతూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చింతూరు పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా తారసపడిన కారును ఆపి సోదాచేయగా వంద కిలోల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న మహారాష్ట్రకు చెందిన స్వప్నిల్ రాతీలాల్, ఆకాష్‌విలాస్ చవాన్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. చింతూరు సబ్ డివిజన్లో ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు 24 గంజాయి కేసులు నమోదుచేసి 2,275 కిలోలు స్వాధీనం చేసుకుని 64 మందిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## భారీ కొండచిలువ హతం

**గూడెంకొత్తవీధి:** మండలంలోని లక్కవరపేట పంచాయతీ తూరుమామిడి గ్రామ సమీపంలో భారీ కొండచిలువ బుధవారం హల్‌చల్ చేసింది. సమీప అటవీ ప్రాంతం నుంచి గ్రామంలోకి కొండచిలువ వస్తుండటాన్ని గమనించిన గిరిజనులు హతమార్చారు.



హతమైన భారీ కొండచిలువ

## మలేరియా, డెంగ్యూ కేసుల తగ్గుదల

- 1,767 గ్రామాల్లో మొదటి విడత దోమల నివారణ మందు పిచికారీ
- రెండో విడతలో 1,617 గ్రామాల్లో నిర్వహణ
- 17 వేల దోమతెరల పంపిణీకి చర్యలు
- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



**పాడేరు:** గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మలేరియా,డెంగ్యూ కేసుల తీవ్రత తగ్గిందని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది సెప్టెంబర్ ఎనిమిది నాటికి జిల్లావ్యాప్తంగా 2,984 మలేరియా కేసులు నమోదైతే ఈ ఏడాది 2,534 నమోదు అయ్యాయని తెలిపారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 114 డెంగ్యూ కేసులు నమోదైతే ఈ ఏడాది 28 కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. ముందస్తు చర్యలు మూలంగా డెంగ్యూ,మలేరియా కేసులు తగ్గాయన్నారు. మొదటి విడతలో దోమల నివారణ మందును 1,767 గ్రామాల్లో పిచికారి చేశామన్నారు. రెండో విడతలో ఎంపిక చేసిన 1,617 గ్రామాల్లో ఈ నెలాఖరుకు పిచికారి పూర్తి చేస్తామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సీఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన 17 వేల దోమ తెరలను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. అన్ని పాఠశాలల్లోను వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ప్రతీ పీహెచ్‌సీలో మలేరియా నిర్ధారణ కిట్లు ఉన్నాయన్నారు.ప్రైవేటు క్లినిక్‌లు,ల్యాబ్‌ల్లో కొన్నిచోట్ల మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేయకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో తెలిపారు.

## లొంగిపోయిన ప్రతి ఒక్కరికి పునరావాసం

- విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్‌జెట్టి
- 23 మందికి రూ.23 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

**పాడేరు:** మావోయిస్టుల్లో పనిచేస్తూ లొంగిపోయిన ప్రతి ఒక్కరికి పునరావాసం కల్పిస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి అన్నారు. బుధవారం ఆయన లొంగిపోయిన మావోయిస్టులకు ఎస్పీ అమిత్‌బర్దర్‌తో కలిసి రూ.23 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవోబీఎస్‌జెడ్‌సీలో గతంలో పనిచేసి లొంగిపోయిన 23 మందికి ఒకొక్కరికి రూ.లక్ష చొప్పున 23 లక్షలు పంపిణీ చేసినట్టు తెలిపారు. జనజీవనస్రవంతిలో కలిసిన తరువాత ఉపాధి పొందేందుకు వీలుగా నైపుణ్యాభివృద్ధి కోసం ఐటీడీఏ ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఇందుకోసం వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్పీ అమిత్‌బర్దర్ మాట్లాడుతూ మావోయిస్టులుగా ఉన్న వారంతా జనజీవనస్రవంతిలో కలిసి వారి సొంత గ్రామాల్లో గౌరవప్రదంగా జీవించాలని కోరారు. లొంగిపోయిన వారిలో కొందరు మాట్లాడుతూ వివిధ రకాల నైపుణ్యాలపై శిక్షణ తీసుకుని కొత్త జీవితాలను ప్రారంభిస్తామని తెలిపారు.



లొంగిపోయిన మావోయిస్టుకు నగదు, వస్తువులను అందజేస్తున్న డీఐజీ గోపినాథ్‌జెట్టి, ఎస్పీ అమిత్‌బర్దర్

## నాణ్యత లేకుంటే చర్యలు

**చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్**

**చింతూరు:** సంతల్లో నాణ్యతలేని వస్తువులు విక్రయించే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకుంటామని స్థానిక ఐటీడీఏ పీవో అపూర్వభరత్ హెచ్చరించారు. బుధవారం ఆయన చింతూరులో జరిగే వారపు సంతను సందర్శించారు. వ్యాపారులు విక్రయిస్తున్న వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు నాసిరకం సరకులు విక్రయిస్తే ఊరుకోబోమన్నారు. సంతలో దుకాణాలు నిర్వహించే వ్యాపారులంతా నాణ్యత కలిగిన సరకులనే అమ్మాలని ఆదేశించారు. సంత నిర్వహణ ప్రాంతం పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్థానిక బస్టాండును పరిశీలించిన పీవో ఆవరణ చుట్టూఉన్న పొదలను తొలగించాలని సూచించారు. బస్టాండ్ ఆవరణలో దుకాణాలు పెట్టుకునేందుకు వీలుగా గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను పీవో ఆదేశించారు.

**స్పందనకు 41 దరఖాస్తులు**

స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పీవో అపూర్వభరత్ వివిధ సమస్యలకు సంబంధించి 41 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న చింతూరు పీవో అపూర్వభరత్

## ఆందోళన కలిగిస్తున్న ముందస్తు ప్రసవాలు



కేజీహెచ్ ఎస్టీ సెల్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

**మహారాణిపేట (విశాఖ):** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముందస్తు ప్రసవాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళనకరమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్‌లో గల సంబంధిత వార్డుల్లో బుధవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. ఏకంగా మూడు గదుల్లో ముందస్తు ప్రసవాలు జరిగిన పిల్లలు చికిత్స పొందుతుండటం ఆందోళనకరమన్నారు. గిరిజన ప్రాంతంలో పౌష్టికాహార లోపం , తల్లీబిడ్డకు సరిపడా ఆహారం తీసుకోకపోవడం, రక్తహీనత వల్ల ముందస్తు ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారికి ప్రత్యేకంగా పౌష్టికాహారం అందించిందని, జగనన్న కిట్ పేరుతో గర్భిణులకు ప్రత్యేకంగా రూపొందించిన పౌష్టికాహార కిట్ అందించేవారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోకపోతే అల్లూరి జిల్లాలో భయంకర పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.

**చట్రాపల్లి బాధితులకు పరామర్శ**

కొండ చరియలు విరిగిపడి తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జీకే వీధి మండలం చట్రాపల్లి గ్రామస్తులను ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర బుధవారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆమె కోరారు.

## బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన

- చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్




మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

**చింతూరు:** బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధక కమిటీ డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ దీనిపై ప్రతి గ్రామంలో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల సిబ్బంది అందరూ పాల్గొనాలని సూచించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి అనర్థాలపై వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సీడీపీవో విజయగౌరి, ఎంఈవో లక్ష్మీ నారాయణ, ఏపీఎం నాయుడు పాల్గొన్నారు.

## 'కొత్తపల్లి' సుందరీకరణ పనులు వేగవంతం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం

**జి.మాడుగుల:** కొత్తపల్లి జలపాతం సుందరీకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. కొత్తపల్లి జలపాతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి జలపాతాన్ని పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని సూచించారు. కొత్తపల్లి జలపాతానికి ప్రధాన రహదారి నుంచి చేపట్టిన సీసీ రోడ్డు పనులను నెలాఖరుకు పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతర్గత విద్యుదీకరణ, ప్లాంటేషన్, పెయింటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ టి.కొండయ్యపడాల్ డీఈ నరేన్, ఏఈ మాణిక్యం, టూరిజం మేనేజర్ మురళి పాల్గొన్నారు.



కొత్తపల్లి జలపాతం వద్ద సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

## బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం



బాధిత కుటుంబానికి నగదు సాయం చేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



సమస్యలపై ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

- గోధుమలంకలో పర్యటించిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు
- బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం, సొంత నిధులతో ఇంటి పైకప్పు రేకులు అందజేత

**కొయ్యూరు:** బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు విమర్శించారు. వరదలు సంభవించి ప్రాణాలు పోతున్నా స్పందించడం లేదన్నారు. మండలంలో బూదరాళ్ల పంచాయతీలో గోధుమలంక గ్రామాన్ని ఎమ్మెల్యేగా మొట్టమొదటిసారిగా సందర్శించారు. గ్రామానికి చెందిన పాంగి హిందుజ ఇటీవల కాలువలో పడి మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వారిని ఓదార్చి ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి తన సొంత నిధులతో పైకప్పు రేకులు ఇతర సామగ్రి అందిస్తామని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

**వినతుల వెల్లువ**

ఈ సందర్భంగా గ్రామంలో రహదారి నిర్మించాలని, పాఠశాల భవనానికి మరమ్మతు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేశారు. కునుకూరు, బాలరేవుల, పోకలపాలెం గ్రామస్తులు వారి సమస్యలు తెలిపారు. వంతమర్రిలో ఎమ్మెల్యేకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. గరికబంద- కన్నవరం రోడ్డు పనులు పూర్తి చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ రాజులమ్మ, ఎంపీటీసీలు మల్లిఖార్జున్, బి అప్పారావు,వంతల కుమారి ఉపసర్పంచ్ సంజీవ్, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, గిరిప్రసాద్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, నాయకులు పోతురాజు సూరిబాబు, శ్రీను, కృప తదితరులు పాల్గొన్నారు.